సాక్షి

పశ్చిమగోదావరి

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురువాయిగూడెంలో మద్ది ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



ఉత్సాహంగా పోటీలు

జంగారెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లా అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. 8లో ▸



బడుల్లోనూ మెరుగ్గా పారిశుద్ధ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేక ఆయాలను నియమించింది. 8లో ▸

న్యూస్‌రీల్

అంకితభావంతో విధులు నిర్వర్తించండి



గ్రూప్-4 అభ్యర్థి కార్తీక్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని గ్రూప్-4లో ఎంపికై ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఏపీపీఎస్సీ 2021లో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెవెన్యూ శాఖలో గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికైన 48 మంది అభ్యర్థులలో 45 మందికి మంగళవారం ఏలూరులో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరిలో 19 మంది ఏలూరు జిల్లాకు, 20 మంది పశ్చిమ గోదావరి జిల్లాకు, మరో 9 మంది తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించబడ్డారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మెరుగ్గా అందించేలా ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. కొత్తగా ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులు ప్రారంభం నుంచే ప్రజలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సేవలందించాలన్నారు. సాధ్యమైనంత వరకు మీ పరిధిలో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్ ఏవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు 96 మంది హాజరు

సాక్షి, భీమవరం: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో నిర్వహించిన పరీక్షలకు 96 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా రెవెన్యూ అధికారిణి కె.కృష్ణవేణి చెప్పారు. భీమవరం డీఎన్నార్ కళాశాల పరీక్షా కేంద్రంలో 109 మందికి 43 మంది హాజరుకాగా, తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో 118 మందికి 30 మంది, శశి కళాశాల సెంటర్‌లో 128 మందికి 23 మంది హాజరయ్యారని తెలిపారు.

57 గ్రామాల్లో 'అసైన్డ్'కు ఆమోదం



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): రైతులకు భూయాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. 20 ఏళ్ల పైబడి అసైన్డ్ భూములు కలిగిన రైతులకు యాజమాన్య హక్కు కల్పించే ప్రక్రియపై తన చాంబర్‌లో సంబంధిత రెవెన్యూ అధికారులతో మంగళవారం జేసీ సమీక్షించి ఆమోదించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 79 గ్రామాల్లో అసైన్డ్ భూములను గుర్తించామని, ఇప్పటివరకు 57 గ్రామాల్లో అసైన్డ్ భూముల రికార్డులను పరిశీలించి ఆమోదించామన్నారు. మంగళవారం మరో ఏడు గ్రామాల భూముల రికార్డులను పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. ఇంకా 15 గ్రామాల రికార్డులను పరిశీలించాల్సి ఉందన్నారు. సంబంధిత గ్రామాల వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐలలో 2023-24 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీ నిమిత్తం ఐదో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పీ రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ ఏరియాలో దరఖాస్తును ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు. అనంతరం దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎంపిక చేసుకున్న ఐటీఐలో ఈ నెల 8న వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు ఈ నెల 9, 10 తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి అర్హులన్నారు. అలాగే 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వెల్డర్ ట్రేడ్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాల కోసం 9న, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం 10వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఆయా కళాశాలల్లో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 08812-230269 నంబర్‌లో సంప్రదించవచ్చని రజిత కోరారు.

విద్యలో సాంకేతికీకరణకు పెద్దపీట

సర్కారు బడుల్లో విద్యను సాంకేతికీకరణ బాట పట్టించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. బడుల్లో సాంకేతికీకరణపై గతంలో ఏ ప్రభుత్వమూ దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఈ తరుణంలో సర్కారు పాఠశాలల విద్యార్థులు కింది స్థాయి నుంచే సాంకేతికతపై పట్టు సాధించేలా ముందుచూపుతో ట్యాబ్‌లను అందిస్తూ విద్యార్థుల దీర్ఘకాల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇప్పటికే గత ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంతో విలువైన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందించిన జగన్ సర్కారు ఈ ఏడాది కూడా ట్యాబ్‌లను అందించి వారి అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటోంది.

- ఇప్పటికే సర్కారు బడుల్లో డిజిటల్ తరగతుల నిర్వహణ
- ఈ ఏడాదీ 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- 398 యూపీ, హైస్కూళ్లలో 17,405 మంది గుర్తింపు



తమకు ఇచ్చిన ట్యాబ్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దశాబ్దం క్రితమే కార్పొరేట్ విద్యారంగం టెక్నో, ఈ-టెక్నో, స్మార్ట్ వంటి పదాలతో తమ సంస్థల్లో విద్యార్థులకు సాంకేతిక విద్య అందిస్తున్నట్లు ప్రచారం చేసుకుని ఆ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షించాయి. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు సాంకేతికతకు ప్రభుత్వ బడుల్లో పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సాంకేతికంగా బాగా వెనుకబడటం అందరికీ తెలిసిందే. ఇటువంటి తరుణంలో భవిష్యత్ అంతా సాంకేతికతదే అని గ్రహించిన ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కింది స్థాయి నుంచే సాంకేతికతకు అలవాటుపడేలా సాంకేతిక పరికరాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. తద్వారా విద్యార్థి పరిణితి చెంది భవిష్యత్‌లో తన ఉనికిని ఘనంగా చాటేలా బీజాలు వేస్తోంది.

ఇప్పటికే డిజిటల్ బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే డిజిటల్ తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తోంది. విద్యలో సాంకేతికీకరణను ప్రవేశపెట్టడంలో భాగంగా స్మార్ట్ టీవీ ద్వారా బోధన, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా బోధన, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, పెర్‌ఫెక్టివ్ అడాప్టివ్ లెర్నింగ్ ట్యాబ్‌లు ఇలా ఒక్కొక్కటిగా సాంకేతికతను చొప్పిస్తూ విద్యలో విప్లవాత్మక మార్పులతో శిఖరాలకు తీసుకువెళుతోంది. ఈ విధానంలో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటమే కాక భవిష్యత్‌లో దేశ, విదేశాల్లో బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు దోహదపడనుంది.

ట్యాబ్‌లతో చదువుపై ఆసక్తి

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిని మించి సాంకేతికతను వినియోగిస్తున్న ప్రభుత్వం గత ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఈ ట్యాబ్‌ల ద్వారా విఖ్యాతి చెందిన బైజూస్ కంటెంట్‌ను విద్యార్థులకు చేరువ చేసి డిజిటల్ బోధనలో మరో అడుగు ముందుకువేసింది. ఈ ట్యాబ్‌ల ద్వారా బోధన విద్యార్థుల్లో విద్యపై ఆసక్తిని పెంచుతోంది. చిన్న వయసు నుంచే ట్యాబ్‌లను వినియోగించి చదువుకోవడం వారిలో నూతన ఉత్సాహం నింపుతోంది.

ట్యాబ్‌ల వినియోగంపై పర్యవేక్షణ

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వినియోగంపై పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక బృందాన్ని నియమించింది. మండలానికి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులకు ట్యాబ్ సాఫ్ట్‌వేర్ సమస్యలపై జిల్లా నోడల్ పర్సన్‌తో శిక్షణ ఇప్పించింది. వీరంతా సంబంధిత మండలాల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను పరిశీలిస్తారు. విద్యార్థి అభ్యసనకు సంబంధించి అవసరమైన వైఫై మేనేజర్, బైజూస్ కంటెంట్, డిక్షనరీ మాత్రమే ఈ ట్యాబ్‌లో అందుబాటులో ఉండేలా ఆయా సాఫ్ట్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేస్తారు. విద్యకు సంబంధించిన యాప్‌లు మినహా ఇతర ఎటువంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసినా, ఇన్‌స్టాల్ చేసినా సంబంధిత ఉపాధ్యాయునికి ఓటీపీ వచ్చేలా ట్యాబ్‌ల రూపకల్పన జరిగింది. అలాగే పాఠశాలలకు సమీపంలో ఉన్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లకు ట్యాబ్‌ల వినియోగంపై పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన ట్యాబ్‌లలో తలెత్తే భౌతిక, సాంకేతిక సమస్యలను డిజిటల్ అసిస్టెంట్లు పరిష్కరించేలా వారికి తగిన తర్ఫీదు ఇచ్చారు.

నవశకానికి నాంది



ప్రభుత్వ విద్యారంగంలో నవశకానికి నాంది పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గొప్ప భవిష్యత్ దార్శనికుడు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను గుర్తించి ఆమేరకు విద్యను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ప్రభుత్వ విద్యలో సాంకేతికీకరణ ప్రవేశపెట్టాలనే ఆలోచనే ఎంతో గొప్ప విషయం. ప్రభుత్వ విద్యారంగంలో మొదలైన సాంకేతిక విప్లవం భవిష్యత్‌లో అత్యుత్తమ ఫలితాలను అందించనుంది.

– గెద్దం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అభ్యసన మెరుగుకు దోహదం



ప్రపంచ స్థాయిలో అభ్యసనకు విద్యార్థులకు ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇకపై ట్యాబ్‌లలోనే పరీక్షలు రాసేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఇంట్లో ట్యాబ్‌లను వినియోగించేటప్పుడు విద్యార్థులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ట్యాబ్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే సమీప సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పరిష్కరించేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

– పీ శ్యామ్‌సుందర్, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

రెండో ఏడాది కూడా పంపిణీకి కసరత్తు

గత ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయడం ప్రారంభించిన ప్రభుత్వం వరుసగా రెండవ ఏడాది కూడా పంపిణీకి కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్యను విద్యాశాఖ అధికారులు తేల్చేపనిలో పడ్డారు. చైల్డ్ ఇన్ఫోలో ఇప్పటివరకు నమోదైన వివరాల ప్రకారం 398 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 17,405 మంది విద్యార్థులను గుర్తించారు. వీరందరికీ కూడా ఈ ఏడాది ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. కాగా గతేడాది 8వ తరగతి చదువుతున్న 18,370 మంది విద్యార్థులకు, 2,613 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. దీనికి సంబంధించి 20,825 ఎస్‌డీ కార్డులను కూడా అందజేశారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం -2024, రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్ తదితర అంశాలపై విజయవాడ నుంచి మంగళవారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది జనవరి ఆరో తేదీ నుంచి 78,568 ఓటర్లను తొలగించగా, అన్నింటిని పునఃపరిశీలన చేసి పూర్తి చేశామన్నారు. ప్రత్యేక ఓటరు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అనర్హుల ఓటుకు సంబంధించి అందిన ఫిర్యాదులను పరిశీలించామన్నారు. ఎపిక్ కార్డుల జనరేషన్ చేపట్టామన్నారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఈవీఎంలకు సంబంధించి స్కానింగ్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాథుర్, ఆర్డీవో దాసిరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం





ఈడూరులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కొత్తనవరసపురంలోని శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

అత్తిలి: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఈడూరులో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి మాట్లాడారు. ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏడు రకాల వైద్యపరీక్షలు చేసి, వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తారన్నారు. క్యాంపులలో నిర్ధారణ కాని వ్యాధులను గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రులకు రిఫర్ చేస్తారన్నారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఓపీ రిజిస్ట్రేషన్, ఐటీ రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, మందుల కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను మంత్రి పరిశీలించారు. వైద్య శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు, 35 మందికి ఎముకలు, 128 మందికి జనరల్ పరీక్షలు, 105 మందికి జనరల్ ఫిజీషియన్, 8 మంది చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ మంతెన సీతారామరాజు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ అబీబుద్దీన్, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఎంపీడీవో ఎండీ అమీలుజమ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం

నరసాపురం రూరల్: ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కొత్తనవరసపురం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడుతూ ఎంత మందిని పరీక్షించారు.. ఇంకా ఎంతమందికి వైద్య పరీక్షలు చేయాల్సి ఉంది అని అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమస్యలను నివృత్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడ నయంకాని వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తించే కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించి చికిత్స అందిస్తామని, ఈ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను ప్రసాదరాజు పరిశీలించి పౌష్టికాహార ఆవశ్యకతను మహిళలకు వివరించాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ, సర్పంచ్‌లు ఈదా జగజ్జీవనరావు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ఎంపీ, ఉభయ గోదావరి జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- ఆచంట, తూర్పుపాలెంలో రూ.7.53 కోట్ల విలువైన ప్రభుత్వ భవనాల ప్రారంభం



ఆచంటలో ఎస్సీ బాలికల వసతిగృహ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీలు మిథున్‌రెడ్డి, బోస్

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, దేశంలో ఇతర రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయని ఎంపీ, ఉభయ గోదావరి జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆచంటలో రూ.3 కోట్లతో నిర్మించిన ఎస్సీ బాలికల ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.15 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, తూర్పుపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.18 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కుడిపూడి సూర్యనారాయణ, రూడా చైర్మన్ మేడపాటి షర్మిళ రెడ్డి, టీటీడీ డైరెక్టర్ మేకా శేషుబాబులతో కలసి ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో వినూత్న పాలనకు శ్రీకారం చుట్టి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి బాట పట్టిస్తున్నారన్నారు. ఆచంట నియోజకవర్గంలో ఒక్కరోజులోనే రూ.7.53 కోట్ల విలువైన అభివృద్ధి ప్రారంభోత్సవాలు చేయడం ఎన్నడూ లేని అభివృద్ధికి తార్కాణమన్నారు. ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్రం దిక్సూచిలా నిలిచిందన్నారు. విద్య వైద్యంతోనే అభివృద్ధి సాధ్యమని భావించి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ చైర్మన్లు చిల్లే లావణ్య, వెలగల వెంకట రమణ, ఎంపీపీలు కేవీఎస్ నారాయణరెడ్డి (వాసు), పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, పోడూరి గోవర్ధన, గుంటూరి పెద్దిరాజు, ఆచంట సర్పంచ్ కోట సరోజని, తూర్పుపాలెం సర్పంచ్ గుబ్బల ఉషారాణి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, దండు పద్మావతి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఎన్నికలు, నాడు-నేడు, హౌసింగ్, జగనన్నకు చెబుదాం, స్పందన, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలకు ప్రజల రద్దీ పెరిగితే షెడ్యూల్‌లో మార్పులు చేసి సంబంధిత ప్రతిపాదనలు కార్యాలయానికి పంపాలని సూచించారు. ఈ వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్య సేవలు ప్రతి ఒక్కరూ పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువు లోగా పరిష్కరించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు, ప్రాధాన్యత భవనాలపై సమీక్షిస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణంపై సమీక్షిస్తూ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. డీఎల్‌డీఓ అప్పారావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్సీ ఆనంద కుమార్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, ఐసీడీఎస్ అధికారి బి.సుజాతరాణి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టరు ఎస్.కీర్తి పాల్గొన్నారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే 10వ తరగతి పరీక్షలకు గతంలో అనుత్తీర్ణత పొంది ప్రస్తుతం ప్రైవేటుగా హాజరుకాగోరు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 16 వరకు, రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 23 వరకు, రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వివరించారు. ఈ తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉంటే తరువాత వచ్చే రోజున ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

'ఎస్సై' రాత పరీక్షలకు సన్నద్ధం



థెరిస్సా కళాశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు నిర్వహించే తుది దశ పరీక్షలకు ఉన్నతాధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను రాత పరీక్షకు ఎంపిక చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో రాత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ నగరంలోని పలు కళాశాలలను మంగళవారం పరిశీలించారు. సీఆర్ఆర్ పాలిటెక్నిక్, మహిళా కళాశాల, డిగ్రీ కళాశాల, ఆర్ఆర్ పేటలోని సెయింట్ థెరిస్సా బాలికల కళాశాలను తనిఖీ చేశారు. ఈ కళాశాలల్లో పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై పరిశీలన చేశారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రాత పరీక్షలను నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఉన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు



తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకటరాయుడు దంపతులు

తణుకు: ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల అమ్మకాలు, విక్రయానంతర సేవల్లో తణుకు పట్టణానికి చెందిన వైనాట్ ఎలక్ట్రానిక్స్ సంస్థ మరో మైలు రాయి అధిగమించిందని సంస్థ అధినేత జుజ్జువరపు వెంకటరాయుడు తెలిపారు. ఈ మేరకు ఇటీవల సెప్టెంబరు 30న హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా వెంకటరాయుడు దంపతులకు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డును అందజేశారు. దక్షిణ భారతదేశం నుంచి జరిగిన ఈ కార్యక్రమంలో 2023 సంవత్సరంలో సంస్థకు ఈ అవార్డు రావడం వినియోగదారులకు తమపై ఉన్న అపారమైన నమ్మకమేనని సంస్థల అధినేత వెంకటరాయుడు తెలిపారు.

9న అప్రెంటీస్ మేళా

ఉండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 9న ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా (పీఎంఎన్ఏఎం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రధానాధికారి వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఐటీఐలోని వివిధ ట్రేడుల్లో ఉత్తీర్ణత కలిగిన ప్రతి ఒక్కరూ నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని ఆయన తెలిపారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొనే అవకాశం ఉన్నందున ఆశక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని వినిగించుకోవాలని సూచించారు. అలాగే జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీలలో ఐదవ విడత అడ్మిషన్‌లకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏజెన్సీలో ఇద్దరు పిల్లల అదృశ్యం

కుక్కునూరు: ఇద్దరు గిరిజన పిల్లల అదృశ్యంపై వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కుక్కునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మారేడుబాక సమీపంలోని చుక్కలబొద్ది గ్రామానికి చెందిన మడకం వీరయ్య కుమారుడు మడకం దేవా(12), మడకం జోగా కుమారుడు మడకం బీమా(13) వారం రోజుల క్రితం ఇంట్లో దాచిన డబ్బులు తీసుకోని ఎటో వెళ్లిపోయారు. గత వారం రోజులుగా పిల్లల ఆచూకీ కోసం తల్లిదండ్రులు వెతికినా ఫలితం లేకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ముందడుగు

- జిల్లాలో 1,440 మంది ఆయాల నియామకం
- నెలకు ఆరువేల రూపాయల గౌరవ వేతనం

సాక్షి, భీమవరం: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే అందరికీ చాలా చిన్నచూపు ఉండేది. అరకొర వసతులతో విద్యాబోధనే కాకుండా మరుగుదొడ్ల సదుపాయం లేక విద్యార్థులతో పాటు మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. అయితే 2019లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలు కల్పిస్తుంది. అంతేకాకుండా ఇంగ్లిషు బోధన, మన బడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాల రూపురేఖలను పూర్తిగా మార్చివేసింది. తరగతి గదులను విద్యార్థులే శుభ్రం చేసుకోవల్సిన దుస్థితి నుంచి ప్రతి పాఠశాలలోనే ప్రత్యేకంగా ఆయాలను ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం చూస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుస్తోంది.

జిల్లాలో 1,375 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో ఉన్న 1,375 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు లక్షా ఏడు వేల మంది విద్యార్థులున్నారు. వీరిలో సగానికిపైగా బాలికలే. గత నాలుగున్నరేళ్లలో జిల్లాలో మనబడి నాడు–నేడు పథకం ద్వారా ఇప్పటికే 493 పాఠశాలలను అభివృద్ధి చేసి సౌకర్యాలను కల్పించారు. ప్రస్తుతం 700లకు పైగా స్కూల్స్‌లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాడు–నేడు పథకంలో మరుగుదొడ్ల నిర్మాణం, పరిశుభ్రతపై అత్యధిక ప్రాధాన్యత కల్పించారు.



ఆకివీడు హైస్కూల్లో నిర్మించిన మరుగుదొడ్లు



శృంగవృక్షం స్కూల్లో మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న దృశ్యం

ఆధునిక టాయిలెట్స్, బాలికలకు విశ్రాంతి గదులు

రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు నేడు ద్వారా అత్యాధునికమైన, నాణ్యమైన టాయిలెట్లు, వాష్ బేసిన్లు, ఆడపిల్లల విశ్రాంతి గదులు చక్కటి నీటి సదుపాయాలతో బాల, బాలికల సంఖ్యను బట్టి నిర్మించడమే కాకుండా, పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేకంగా ఆయాలను సైతం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ జిల్లాలోని పాఠశాల్లో 1,440 మంది ఆయాలను నియమించారు. వీరికి నెలకు రూ.6000 గౌరవ వేతనం వచ్చేలా నెలకు రూ.86 లక్షలను ఖర్చు చేస్తుంది. అలాగే మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి అవసరమైన పరికరాలను ప్రభుత్వమే అందిస్తుంది.

190 పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ల నియామకం

మనబడి – నాడు నేడు ద్వారా కార్పొరేట్ స్థాయి మౌలిక వసతుల కల్పనతో పాటు పాఠ్యాంశ బోధనకు అవసరమైన కంప్యూటర్, టీవీలు, ఇతర పాఠశాల ఆస్తులు కాపాడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్స్‌ను సైతం నియమించింది. ఇప్పటి వరకు జిల్లాలోని హైస్కూల్స్‌లో 190 మందిని నైట్ వాచ్‌మెన్స్‌ను నియమించి వారికి ఒక్కొక్కరికి నెలకు రూ. 6 వేలు వేతనాన్ని చెల్లిస్తోంది. విద్యార్థుల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణను కూడా చేస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 1,440 మంది ఆయాలను నియమించి మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకున్నాం. మనబడి నాడు–నేడు పథకంలో నిర్మించిన టాయిలెట్స్, రెస్ట్ రూములు సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా వాటి నిర్వహణకు పెద్దమొత్తంలో ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవడంతోపాటు పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు సహకరించాలి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం....

క్లీనింగ్ సామగ్రి బాధ్యత ప్రభుత్వానిదే..



ప్రభుత్వ పాఠశాల్లోని మరుగుదొడ్ల నిర్వహణకు అవసరమైన రసాయనాలు, పరికరాలు టాయిలెట్లు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. ఆడ పిల్లలకు ఆయాలు కూడా తమ పిల్లలకు సేవ చేస్తున్నట్లు భావించడం ఆనందదాయకం. రోజుకు నాలుగు దఫాలు టాయిలెట్ శుభ్రం చేయడం వల్ల అవి పరిశుభ్రంగా ఉంటున్నాయి.

– కె.కృష్ణారావు, మధ్యాహ్న భోజన పథకం జిల్లాప్రోగ్రాంకోఆర్డినేటర్, భీమవరం.

డబ్బు కోసం టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు

నరసాపురం చైతన్య ఆసుపత్రి వైద్యుడి ఆందోళన



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ చైతన్య

నరసాపురం: కొందరు టీడీపీ నాయకులు తనను డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నారని నరసాపురం పట్టణానికి చెందిన చైతన్య ఆస్పత్రి అధినేత డాక్టర్ దాసిరి కృష్ణ చైతన్య ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై న్యాయపరంగా పోరాడాలని తాను నిర్ణయించుకున్నట్టు ఆయన చెప్పారు. మంగళవారం స్థానిక చైతన్య ఆస్పత్రి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ పట్టణానికి చెందిన టీడీపీ నాయకురాలు జి.శివగౌరి తన భర్త ఆదినారాయణను వైద్యం కోసం తీసుకొచ్చారని తెలిపారు. ఆయన మలద్వారం కుంచించుకుపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని పరీక్షల్లో గుర్తించి జూలై 6న ఆపరేషన్ చేశామన్నారు. రెండు నెలల నుంచి శివగౌరి, మరో ఇద్దరు టీడీపీ నాయకులు తన దగ్గరకు వచ్చి ఫిస్టులా ఆపరేషన్ చేయాల్సి ఉండగా, పైల్స్ ఆపరేషన్ చేశానని బెదిరిస్తున్నారని చెప్పారు. రూ.2 లక్షలు ఇవ్వకపోతే అల్లరి చేస్తామని బెదిరించారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఏ తప్పూ చేయలేదని చెప్పారు. డబ్బు ఇవ్వలేదని కక్షతో తనను అల్లరి చేస్తున్నారని వాపోయారు. వీరి వ్యవహారాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. టీడీపీ నాయకులు తనను డబ్బులు డిమాండ్ చేసిన సీసీ టీవీ పుటేజీలు కూడా తన వద్ద ఉన్నాయని వివరించారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడమే లక్ష్యం

ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: వృత్తిపరంగానే కాకుండా ఇతర రంగాల్లో సైతం అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలను పెంచేలా విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఆర్జీయూకేటీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) హైదరాబాద్‌లు అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నామని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. ఆర్జీయూకేటీ, ఐఎస్‌బీల మధ్య సోషల్ ఎమోషనల్ లెర్నింగ్ ప్రోగ్రామ్ పై ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ట్రిపుల్‌ఐటీలో మంగళవారం ఆర్జీయూకేటీ అధికారులు, ఐఎస్‌బీ అధికారులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాన్సలర్ మాట్లాడుతూ చేసే పనిలో విజయం సాధించాలంటే సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను విస్తృతశ్రేణి సమగ్ర నైపుణ్యాలతో సన్నద్ధం చేస్తామన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను పెంపొందింపజేసేందుకు కూడా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఐఎస్‌బీ డీన్ ఆచార్య పి.మదన్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను శక్తివంతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్యలక్ష్యమన్నారు. ఈ ఒప్పందం నాలుగేళ్ల పాటు అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు అనేక అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ దీపామణి, ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల డైరెక్టర్‌లు ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఆచార్య జయరామిరెడ్డి, ఆచార్య జగదీశ్వరరావు, ఆచార్య సంధ్యారాణి, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు, చీఫ్ ఏఓ భానుకిరణ్, ప్రొఫెసర్లు కె.వియన్నారావు, మోహన్‌రావు, సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు



అండర్–19 సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులు



బేస్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ బాలికల జట్ల ఎంపికలు మంగళవారం నిర్వహించారు. స్థానిక గురుకుల కళాశాలలో నిర్వహించిన ఈ ఎంపికలో జిల్లా జట్లను ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.జయరాజు, జిల్లాలోని వివిధ కళాశాల పీడీ, పీఈటీలు పాల్గొని ఎంపికలు నిర్వహించారు.

అండర్–19 సాఫ్ట్‌బాల్ టీమ్:

ఏపీఎస్‌డబ్ల్యూర్ జేసీ జంగారెడ్డిగూడెం నుంచి పి.ప్రియాంక, బి.నయనతార, డి.రమ్య, బి.ధరణి, కె.భవానీ, వై.రాజ్యలక్ష్మి, కె.సునీత, టి.శిరీష, పి.తేజస్విని, ఎస్‌కేఎస్‌డీ (మహిళలు) కళాశాల తణుకు నుంచి ఎ.శిరీష, ఏపీఎస్‌డబ్ల్యూర్ గోపాలపురం నుంచి కె.నిఖిత, సాయి రాకేష్ స్కూల్ కొయ్యలగూడెం నుంచి టి.లక్ష్మి, తణుకు ప్రగతి కాలేజ్ నుంచి పి.తనుష్క, ఏపీఎస్‌డబ్ల్యూర్ జేసీ పాలసానిపల్లి నుంచి జి.ప్రతిమ, జి.మేరీ సుమతి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ద్వారకాతిరుమల నుంచి ఎస్.శృతి, స్టాండ్‌బై కింద తణుకు ప్రతిభ కాలేజ్ సీహెచ్ ధరణి, ద్వారకాతిరుమల నుంచి కె.మానస, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ జంగారెడ్డిగూడెం నుంచి కె.ఇందు, పి.మానసలు ఎంపికయ్యారు.

అండర్–19 బేస్‌బాల్ టీమ్

ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జంగారెడ్డిగూడెం నుంచి పి.ప్రియాంక, బి.నయనతార, డి.రమ్య, బి.ధరణి, కె.భవానీ, వై.రాజ్యలక్ష్మి, పి.తేజస్విని, డి.శృతి, ఎం.హన్సిక, టి.నాగవైష్ణవి, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల తణుకు నుంచి ఎ.శిరీష, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గోపాలపురం నుంచి కె.నిఖిత, ప్రగతి కాలేజ్ తణుకు నుంచి పి.తనుష్క, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాలసానిపల్లి నుంచి జి.రాజేశ్వరి, సీహెచ్‌గౌతమి, ప్రతిభ కాలేజ్ ధర్మాజీగూడెం నుంచి సీహెచ్ ధరణి, స్టాండ్‌బైగా సాయిరాజేష్ స్కూల్ కొయ్యలగూడెం నుంచి ఎం.పుష్ప, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జంగారెడ్డిగూడెం నుంచి కె.సునీత, కె.ఇందు, గోపాలపురం నుంచి కె.మౌనిక ఎంపికయ్యారు.

అవయవదానం..ఆదర్శవంతం

- డి.కుముదవల్లి యువకుడికి బ్రెయిన్ డెడ్
- ఆరుగురికి అవయవదానం



వంక శివకుమార్ (30)

తాడేపల్లిగూడెం: అరమరికలు లేకుండా ఆనందంగా సంసారం సాగించే అన్యోన్యదాంపత్యం. చూడముచ్చటైన జంట. ఇద్దరిదీ ఒక చోట కొలువే. ఇంకేం విడిపోని బంధం. ఈ ప్రేమబంధం చూసి కాలానికి కూడా కన్నుకుట్టిందో? ఏమో? భర్తను భార్య నుంచి విడదీసింది. భార్య ఆత్మస్థైర్యం కోల్పోకుండా తన భర్త అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలు నిలపాలని అత్తింటి వారి ఆసరాతో ఆరుగురికి అవయవదానం చేసి భర్త శివకుమార్‌ను చిరంజీవిని చేసింది. ఈ ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. గణపవరం మండలం డి.కుముదవల్లి గ్రామానికి చెందిన వంక శివకుమార్ (30)భార్య మౌనికతో కలిసి హైదరాబాద్‌లోని స్టీల్ క్యూబ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. గత నెల 29న శివకుమార్‌కు తీవ్రమైన తలనొప్పితో స్పృహ తప్పిపడిపోయాడు. నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షల అనంతరం శివకుమార్‌కు బ్రెయిన్‌డెడ్ అయ్యినట్టుగా వైద్యులు చెప్పారు. 48 గంటల పరిశీలన అనంతరం సోమవారం శివకుమార్ మరణించినట్టుగా వైద్యులు ధ్రువీకరించారు. శివకుమార్ తండ్రి శ్రీనివాసరావు, భార్య మౌనికలు శివకుమార్ అవయవాలను దానం చేసి మరికొందరికి ప్రాణాలు నిలపాలని నిర్ణయించారు. జీవన్‌దాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శివకుమార్ ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయాలను సేకరించారు. వాటిని మరో ఆరుగురికి దానం చేసే ఏర్పాట్లు చేశారు. మంగళవారం కిమ్స్ ఆసుపత్రిలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో శివకుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. యువకుని మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి డి.కుముదవల్లికి పంపించే ఏర్పాట్లు చేశారు. బుధవారం డి.కుముదవల్లిలో అంతిమసంస్కారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కానిస్టేబుల్ నరేంద్రకు ఘన నివాళులు



ఆగిరిపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, స్థానికులు

నూజివీడు(ఆగిరిపల్లి): యువకుడి దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నరేంద్రకు నివాళులర్పిస్తూ మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో మంగళవారం రాత్రి పోలీసులు, రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. దీనిలో పాల్గొన్న నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలను కాపాడేందుకే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని, అలాంటి పోలీసులపైనే దాడి చేస్తే ఎలా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనాగరిక సంఘటనలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. రాజకీయ నాయకులు ఇలాంటి సంఘటనల్లో జోక్యం చేసుకోకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో నూజివీడు రూరల్ సీఐ పి.బాలసురేష్‌బాబు, ఎస్సై నంబూరు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: ఆగిరిపల్లి స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నరేంద్ర మృతి చెందిన నేపథ్యంలో నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో పోలీసులు, వ్యాపారులు, విలేకరులు కలిసి మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పట్టణ, రూరల్ సీఐలు ఎంవీవీఎస్ఎన్ మూర్తి, పి.బాలసురేష్‌బాబు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం చేసిన యువకుడికి రిమాండ్

పాలకోడేరు: శృంగవృక్షం గ్రామానికి చెందిన వివాహితపై భీమవరం రూరల్ మండలం చిన్న అమిరం గ్రామానికి చెందిన బూసి రమేష్ బాబు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడంటూ శృంగవృక్షం గ్రామానికి చెందిన వర్ధనపు మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం బూసి రమేష్ బాబు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నిందితుడికి రిమాండ్ విధించిందని స్టేషన్ రైటర్ నాగరాజు విలేకరులకు తెలిపారు. శృంగవృక్షం గ్రామానికి చెందిన వర్ధనపు మౌనిక భర్త ఉపాధి కోసం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు. గత నెల 30న తెల్లవారుజామున తలుపుతట్టగా మౌనిక తలుపు తీసిన వెంటనే రమేష్‌బాబు ఆమెను కిందపడేసి అత్యాచారయత్నానికి పాల్పడుతుండగా మౌనిక చెల్లి అడ్డుపడి కేకలు వేసింది. దీంతో స్థానికులు వచ్చి రమేష్‌బాబును పట్టుకున్నారు. రమేష్ బాబుపై వర్ధనపు మౌనిక ఫిర్యాదు చేయడంతో అరెస్ట్ చేసి కోర్టు హాజరుపర్చారు.

క్లుప్తంగా

విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ


రేలంగిలో విద్యార్థులకు బస్ పాస్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలతో పాటు దాతల సహకారన్ని వినియోగించుకోవాలని మండలంలోని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ కాకర్ల వేణు బాబు అన్నారు. మంగళవారం రేలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థినీ, విద్యార్థులకు తణుకు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చిట్టూరి సుజాత వారి ఆర్థిక సహాయంతో తణుకు ఆర్టీసీ వారు ఉచితంగా బస్ పాస్‌లు అందిచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఏ కోఆర్డినేటర్ కోరిపల్లి వివి సత్యనారాయణ, క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు తిర్రే రవీంద్ర కొప్పినీడి సుబ్బారావు, డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్వాతిని పరామర్శించిన పీవీఎల్

పాలకోడేరు: ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స అనంతరం ఇంటికి చేరిన పాలకోడేరు ఎంపీటీసీ కొత్తపల్లి స్వాతి, ఆమె భర్త శివను మంగళవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు పరామర్శించి, ఆయన ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ ఎంపీటీసీ ఇంటికి వెళ్లి భార్యాభర్తలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచ్ దెందుకూరి వెంకటరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు ఎంపీటీసీ సభ్యులు కె నాగలక్ష్మి, షేక్ పాపా సాహెబ్, కాటూరి శాంతకుమారి, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి, భూపతి రాజు వంశీకృష్ణంరాజు, పాలా రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

ఆకివీడు: వైఎస్సార్ సీపీ ఆకివీడు మండల కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన అన్నెం కృష్ణ మంగళవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజును మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ వానపల్లి బాబూరావు, వైఎస్సార్‌సీపీ గుమ్ములూరు గ్రామ కమిటీ అధ్యక్షులు చిక్కాల రామాంజనేయులు(చిన్నా), దేవస్థానం చైర్మన్ అన్నెం శ్రీనివాసరావు, కూసంపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాల డైరెక్టర్‌గా జగపతిరాజు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా ఎం జగపతిరాజును నియమిస్తూ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ ఆదేశాలు జారీ చేశారు. జగపతిరాజు 42 ఏళ్లగా ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో అధ్యాపకునిగా, సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేసి ఐదేళ్ల క్రితం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. గత నెల 30న పదవీ విరమణ చేశారు. జగపతిరాజు సేవలను గుర్తించి డైరెక్టర్‌గా నియమించారు. జగపతిరాజును పలువురు అభినందించారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణాన్ని సుందర పట్టణంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని భీమవరం మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల అన్నారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణాన్ని సుందరీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భీమవరం పురపాలక సంఘంలో పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని, వర్క్ ఆర్డర్లు ఇచ్చి పనులు ప్రారంభం కానివి వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ పి.త్రినాథ్‌రావు, ఏసీపీ పి.గౌరు, డీఈ కె.అప్పలరాజు, డీఈ శ్రీనివాస్, రెహమన్, ఏఈలు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో గ్రామ సభలు

వీరవాసరం: మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ సభల్లో ఆయా సిబ్బంది వివరించారు. గ్రామస్తుల పేర్కొన్న అంశాలతో గ్రామ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదింపజేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో గూడూరి ఓంకారం, గెడ్డం భారతి, చికెలే మంగతాయారు, వీరవల్లి శ్రీనివాసరావు, బీసెట్టి లక్ష్మి, నల్లమల్లి వేణుక,దాసరి మహాలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభం
- రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల అందజేత


తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


పడమరవిప్పర్రు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న కోసూరి చంటిరాజు తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని కడియద్ద సచివాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతోనే రాష్ట్రంలోని మానవ వనరులు సురక్షితంగా ఉంటాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు సింధు, శ్రీహర్ష, ఇ.శ్వేతశ్రీ, ఆర్.స్నేహితలు 371మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం వద్ద పౌష్టికాహార ప్రదర్శన శాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాతం కోటేశ్వరి, ఎమ్పీటీసీ దుర్గాదేవి, పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి టి.పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, బూరయ్య, పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), యాతం వెంకటరమణ, దారపురెడ్డి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ఎస్తేరు రాణి, సచివాలయ, అంగన్‌వాడీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష– పేదలకు రక్ష

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఎంతో రక్ష అని వైఎస్సార్ సీపీ సీనియర్ జిల్లా నాయకులు కోసూరి చంటిరాజు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పడమరవిప్పర్రు సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ తెంటు జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చంటిరాజు మాట్లాడుతూ చరిత్రలో ఇప్పటివరకు ప్రభుత్వ డాక్టర్ ద్వారా ఇంటింటికీ ఉచిత వైద్యసేవలు చేయించిన నాయకుడే లేరన్నారు. జగనన్న పేదల నాడి తెలిసిన డాక్టర్‌గా విద్య, వైద్యం ద్వారా ఉచిత సేవలు అందించి ప్రజల కష్టాలను తీర్చుతున్న ఏకైన నాయకుడన్నారు. చరిత్రలో జగనన్న శకం సువర్ణ అధ్యాయంగా కొనియాడదగినదన్నారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోణం వీరయ్య, సర్పంచ్ తెంటు జయలక్ష్మి తదితరులు మాట్లాడారు. పెంటపాడు ప్రాథమిక వైద్యాధికారి తోట రాజేష్, డాక్టర్ మౌనిక, ముదునూరు వైద్యాధికారి డాక్టర్ పూజిత, రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ శిబిరంలో విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ట్రస్టుబోర్డు ప్రత్యేక సభ్యులు కోసూరి వెంకట్రాజు, సొసైటీ అధ్యక్షుడు కశిరెడ్డి నాగేశ్వరరావు(అబ్బాయి), ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి, మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు దోకల నాగేశ్వరరావు, పసల చంటి, కోసూరి సుబ్బరాజు, తెంటు గోపి, యండ అప్పారావు, చినిమిల్లి వెంకయ్య, గొర్రిపాటి సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్టారావు, శ్యాం, ఎంపీడీవో బాలాజీ, గ్రామ కార్యదర్శి చక్రవర్తి, ఐసీడీఎస్ అధికారులు, పెంటపాడు, ముదునూరు ఆరోగ్యసిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

తణుకు టౌన్: గ్రామీణ పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు రుద్ర ధనరాజు కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని 2వ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎమ్పీడీవో కే కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్ గోపాల కృష్ణ, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వారందరికీ రాగిజావ పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో మొత్తం 341 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు.

గ్రామాల్లో చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష

ఇరగవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలు మేలు జరుగుతుందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ అన్నారు. మండలంలోని అర్జునుడుపాలెంలో గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ముందుగా సర్వే నిర్వహించి అనంతరం గ్రామ సభలు నిర్వహించి ముందుగా సర్వే చేసి టోకెన్లు ఇచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు ఉచితంగా అందించడం జరిగుతుందన్నారు. మొత్తం 401 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎంపీడీవో ఎ శ్రీనివాస్, వైద్యాధికారులు, ఎఎన్‌ఎం కృష్ణ వేణి, పాల్గొన్నారు.


దువ్వలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు


ఇరగవరం మండలం కావలిపురంలో సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం


విశిష్ట అతిథి మురళీమోహన్‌రావును సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అసోసియేషన్ వార్షికోత్సవం వాకర్స్ భవనంలో ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ వల్లూరిపల్లి మురళీమోహన్‌రావు, జిల్లా గవర్నర్ కనగన కృష్ణమూర్తి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ తానేటి శ్రీనివాస్‌రావులు హాజరై వాకర్స్ సేవలను అభినందించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకట కృష్ణరావు, అధ్యక్షుడు కేవీ చలం, కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

7న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదిన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ నేడు గూడెం రాక

తాడేపల్లిగూడెం: ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం తాడేపల్లిగూడెం రానున్నారు. వైఎస్ఆర్ ఇంటలెక్చ్యువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవర్ స్టేట్ అవర్ లీడర్ ప్రోగ్రాంలో పాల్గొననున్నారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చేరుకొని రాత్రికి అక్కడే బస చేస్తారు.

అజయ్‌కుమార్ మిశ్రాను విచారించాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతుల హత్యాకాండకు ప్రధాన కారకుడైన కేంద్ర మంత్రి అజయ్‌కుమార్ మిశ్రాను పదవి నుంచి తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కండెల్లి సోమరాజు, రైతు సంఘం నాయకుడు పాలుపూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లఖింపూర్ కేరీ దాడిలో నలుగురు రైతులు చనిపోవడం వెనుక మిశ్రా పాత్ర ఉందన్నారు. వ్యవసాయ చట్టాలు నిరసిస్తూ ఐక్య రైతు ఆందోళనలను అణచివేయడానికి బీజేపీ పన్నిన కుట్ర అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాశం చిన పెద్దిరాజు, పాలుపూరి సత్యవతి, పాలుపూరి వెంకాయమ్మ, శ్రీను, మాగంటి చింతారావు, కొండపల్లి శిరీష, పి.సత్యవతి, పి.శ్రీను, పి.నాగమణి, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంట గ్రామంలో బ్లాక్ డే కార్యక్రమం దృశ్యం

అజయ్‌కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైతులపై పెట్టిన తప్పుడు కేసులు రద్దు చేయాలని, అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విప్పర్రు సుబ్రహ్మణ్యేశ్వరునికి పంచామృతాభిషేకాలు

పెంటపాడు: మండలంలో ప్రసిద్ధి చెందిన పడమరవిప్పర్రు సంతాన సుబ్రహ్మణేశ్వరుని ఆలయం వద్ద మంగళవారం స్వామివారి కృత్తికా జన్మనక్షత్రం పురస్కరించుకొని ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృత అభిషేకాలు, రాహుకేతు పూజలు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు. మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు పసల కుటుంబీకుల ఆధ్వర్యంలో పూజలలో పాల్గొన్న భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు పసల కనకసుందర్రావు, పసల చంటి, గంగన్న, సత్యనారాయణ, అర్చకులు కొడవటిగంటి నరసింహాచార్యులు, ఆకుతీగపాడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


పడమరవిప్పర్రు సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి పంచామృత అభిషేకం, హారతి ఇస్తున్న దృశ్యం

5న అలంపురంలో ఉచిత వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలో ఈనెల 5న అలంపురం వెంకటరమణ సేవాధారిటీ ఆసుపత్రిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు, జనరల్ సర్జన్, చర్మవ్యాధుల నిపుణలు, ఊపిరితిత్తుల వైద్యనిపుణులు, చెవి, ముక్కు, గొంతు నిపుణులు రానున్నట్లు తెలిపారు. అదేరోజు గుండెకు సంబంధించి సమస్య ఉన్నవారికి ఉచితంగా ఈసీజీ, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దువ్వలో శానిటరీ గోడౌన్ల తనిఖీ


దువ్వలో శానిటరీ గోడౌన్లను తనిఖీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: పాఠశాల విద్యార్థినీలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న శానిటరీ న్యాప్‌కిన్స్ గోడౌన్లను స్వచ్ఛ బృందం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో శానిటరీ న్యాప్‌కిన్స్ గోడౌన్లలో నిల్వ చేసిన స్టాక్‌ను బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల పారిశుద్ధ్య కమిటీ జిల్లా కోఆర్డినేటర్ కే కృష్టారావు, జీ చిన్నయ్య, ఎంఈవో 2 టీ హైమావతి, హెచ్‌ఎం టీ వరలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్ దుర్గ, బీ సుధారాణి పాల్గొన్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ల అందజేత


కాకినాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పింఛను అందిస్తున్న వలంటీర్ ప్రీతి


గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

తణుకు అర్బన్: తణుకుకు చెందిన వలంటీర్లు దూర ప్రాంతాలకు వెళ్లి మరీ పింఛన్ అందించడంతో పింఛన్ దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 6వ వార్డుకు చెందిన మార్లపూడి సుందరి అనారోగ్య సమస్యలతో మంగళగిరిలోని ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని అక్కడే బంధువుల ఇంట్లో ఉన్నారు. సదరు వార్డు వలంటీరు దిర్సిపో కిషోర్ మంగళవారం మంగళగిరి వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ అందజేశారు. అలాగే వీరభద్రపురానికి చెందిన మల్లిపూడి అప్పారావు అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీరు రాచర్ల ప్రీతి కాకినాడ వెళ్లి పింఛను అందజేసింది. దీంతో జగనన్న ప్రభుత్వ పనితీరు బాగుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

వలంటీర్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ పింఛన్ తీసుకోలేని పరిస్థితులు ఉన్న ఇరువురికి గుంటూరు వెళ్లి వలంటీర్ పింఛన్లు అందజేసి రావడం అభినందనీయమని 18వ వార్డు ఇంచార్జి శివకుమార్, గృహసారధులు వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లముదునూరుపాడుకు చెందిన మేక సుందరమ్మ, విల్లూరి సుజాత అనే ఇద్దరు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న వలంటీర్ నూకపల్లి వెన్నల గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఇరువురికి పింఛన్‌లు అందజేసింది. అంత దూరం వ్యయప్రయాసాలను భరించి పింఛన్‌లు అందించి రావడం మంచి నిర్ణయమని పలువురు వలంటీర్‌కు అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెంటపాడు: ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొవాలని విప్పర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కోసూరి చంటిరాజు, బోణం వీరయ్యలు పేర్కొన్నారు. మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి, ఆధ్వర్యంలో విప్పర్రు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల ఎగ్జిబిషన్ మంగళవారం నిర్వహించారు.అనంతరం తల్లుల ఆధ్వర్యంలో చేసిన పౌష్టికాహార పిండివంటల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన పోషణ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ తెంటు జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి, పోషణపై తల్లులకు అవగాహన కల్పించారు.


పౌష్టికాహార మాసోత్సవాల ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విప్పర్రు వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల ఐసీడీఎస్ అధికారులు

తలుపు తట్టి.. నాడి పట్టి..

- గ్రామాల్లో జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష
- ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది
- రోగులకు 7 రకాల వైద్యపరీక్షలు
- ముమ్మరంగా ఆరోగ్యశిబిరాలు


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభ కార్యక్రమంలో పార్టీ నాయకులు, డాక్టర్లు

పెంటపాడు: అవ్వా, తాత ఆరోగ్యం ఎలా ఉంది. తాతా రోజూ సుగర్ మాత్రలు వేసుకొంటున్నావా... పెద్దాయనా.. బీపీ కంట్రోల్‌లోనే ఉంటోందా.... పెద్దమ్మా మన ఇంట్లో ఎవరికైనా జలుబు, జ్వరాలు ఉన్నాయా....అంటూ వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకొంటున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే...దీనిలో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్యసిబ్బంది పల్లెబాట పట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి జనం నాడిపట్టి మరీ వైద్య పరీక్షలు చేస్తున్నారు. పల్లెల్లో జగనన్న ఆరోగ్య సురక్ష జోరుగా సాగుతోంది.

సర్వే ఇలా...

సెప్టెంబర్ 16 నుంచి 30 వరకు కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్‌ఎంలు, బీపీ మిషన్లు పట్టి ఇళ్లవద్దకు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను నేరుగా తెలుసుకొన్నారు. సమస్యలకు సంబంధించి 7 రకాల వైద్యపరీక్షలు అక్కడి కక్కడే నిర్వహించారు. 19 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికి రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయడంతో పాటు 10 సంవత్సరాలు వయస్సు దాటిన వారందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు, రెండు వారాలకు మించి దగ్గుతో భాదపడుతున్న వారికి డెంగీ, మలేరియా, యూరిన్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వవలంటీర్లు, గృహసారధులు తదితరులు ఆరోగ్యసిబ్బందికి సహాయకంగా పాల్గొని అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తిస్తున్నారు. వారికి గ్రామాల్లో నిర్వహించే వైద్యపరీక్షల కోసం టోకెన్‌లు జారీ చేశారు. మెరుగైన వైద్యం సలహాలు అందిస్తున్నారు.

అనారోగ్య రహిత గ్రామాలే లక్ష్యం



అనారోగ్య రహిత గ్రామాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ విధానం సత్ఫలితాలు ఇస్తోంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు కార్పొరేట్ వైద్యాన్ని గ్రామాల్లోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– దాసరి హైమావతి, ఎంపీపీ పెంటపాడు

సద్వినియోగం చేసుకోండి



సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు ఆరోగ్య సురక్షపై పూర్తి సర్వే చేశాం. జగనన్న ఆరోగ్యశిబిరాలు నిర్వహించేందుకు 30 నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. మండలంలో 22 గ్రామాలకు గాను 18 శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. రోగులకు నిర్వహించే వైద్య పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పాఠశాలల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శిబిరాల వద్ద తగిన సదుపాయాలు కల్పిస్తున్నాం.

– సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో పెంటపాడు